# ఆచార్య వెల్చేరు నారాయణరావు

ఆచార్య వెల్చేరు నారాయణరావు ప్రముఖ తెలుగు సాహిత్య విమర్శకుడు, పరిశోధకుడు, అనువాదకుడు మరియు పండితుడు. ఏలూరు సి.ఆర్.రెడ్డి కళాశాలలో బి.ఎ, ఆంధ్రవిశ్వకళా పరిషత్తులో ఎం.ఎ. పూర్తిచేసిన అనంతరం 1970లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి లింగ్విస్టిక్స్ లో డిప్లొమా అందుకున్నారు. అనంతరం 1971లో అమెరికాలోని విస్కాన్సిన్- మాడిసన్ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‘మెంట్ ఆఫ్ సౌత్ ఏషియన్ స్టడీస్ లో ఉపన్యాసకునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు.

1974లో ఆంధ్రవిశ్వకళాపరిషత్తు నుంచి తెలుగులో కవితా విప్లవాల స్వరూపం అంశంపై చేసిన పరిశోధనకు గాను పి.హెచ్.డి. పట్టా అందుకున్నారు. విస్కాన్సిన్- మాడిసన్ విశ్వవిద్యాలయంలోనే 1975లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, 1981లో అసోసియేట్ ప్రొఫెసర్ గా అనంతరం 1987లో ఆచార్యునిగా పదోన్నతి పొందారు. 2009-10 నాటికి యూనివర్శిటీ ఆఫ్ చికాగో, ఎమోర్య్ విశ్వవిద్యాలయాలకు విజిటింగ్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు.

తెలుగులో, ఆంగ్లంలో పలు గ్రంథరచన, ఎన్నో ప్రామాణిక పత్రికల్లో వ్యాసరచన, పరిశోధనాత్మక గ్రంథాల్లో వ్యాసరచన ద్వారా భాగస్వామ్యం చేశారు. అంతేకాక తెలుగు కావ్య నాటక, నవల, కథలను ఆంగ్లంలోకి అనువదించి వాటి విశిష్టత తులనాత్మకంగా అధ్యయనం చేసి ముందుమాటలుగా రాశారు. ఈ అనువాదాలు అంతర్జాతీయ స్థాయి ప్రామాణిక పత్రికల్లో ప్రచురించి ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాల ప్రచురణలుగా వెలువరించడం వల్ల వాటికి ప్రామాణికత కట్టబెట్టి ప్రపంచ స్థాయిలో తెలుగు సాహిత్యానికి గుర్తింపు దక్కడానికి తనవంతు కృషి చేస్తున్నారు.

జెరూసలేంలోని హిబ్రూ విశ్వవిద్యాలయం యొక్క ఇన్స్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్డ్ స్టడీస్(1987), మేడిసన్ విశ్వ విద్యాలయంలో ఇన్స్టిట్యూట్ ఫర్ రీసర్చ్ ఇన్ హ్యూమానిటీస్(1999), విస్స్ ఛాఫ్ట్ కళాశాల, బెర్లిన్(2000-01) ఫెలోగా, మేడిసన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఇన్స్టిట్యూట్ ఫర్ రీసర్చ్ ఇన్ హ్యూమానిటీస్(2005)లో సీనియర్ ఫెలోగా నియమించి గౌరవించాయి.

2004లో డేవిడ్ షుల్మన్ తో సంయుక్తంగా అసోసియేషన్ ఫర్ ఏషియన్ స్టడీస్ నుంచి "ఎ.కె.రామానుజన్ అనువాద బహుమతి" అందుకున్నారు.

ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయం 2004-05 సంవత్సరానికి గాను రాధాకృష్ణన్ స్మారకోపన్యాసానికి గాను ఎంపిక చేసి గౌరవించింది.

2005లో ప్రతిష్టాత్మక ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక ఆహ్వానంపై 3సార్లు ఉపన్యసించారు. పలు ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో, అనేక విశిష్ట వేదికల మీద ఆహ్వానాల మేరకు ఉపన్యసించారు. అంతర్జాతీయ స్థాయిలో పలు సదస్సుల్లో ప్రసంగించారు.